# పెంకుపురుగు

చాగంటి సోమయాజులు

నిన్నతేః మొన్నదాకా అంట్లు తోముకు బతుక్కొచ్చిందే అప్పాయమ్మ. దాన్నే గుండాలవారి వీధిలో అంతా అప్పి అని పిలుస్తారు.

కాని ఇప్పుడు అంట్లు తోముకుని, పాచి పనులు చెయ్యవలసిన అవసరం లేదు. ఆ అవసరం తీరిపోయి నవమాసాలూ గడిచాయి. అప్పి ఇంకో జన్మెత్తి అప్పాయమ్మ అయిపోయింది.

అంట్లు తోముడు బతకడంలో లాభాలున్నాయి. సంసారులు వాకిట్లో దానికి అన్నాలు కూరలు వేస్తారు. పండుగపర్వం, పెళ్లి పేరంటం వొచ్చినప్పుడు ఊరికే పోనివ్వరు. చేస్తున్న పని చిన్నతనమైనది కానికి ఫాయితీ లున్నాయి.

చాలీ చాలనిబట్టలు, మాసి కుళ్ళిపోయినవి కట్టుకొని మొన్న మొన్నటిదాకా అప్పి అంట్లు పనికి వెళ్ళినదే. ఇప్పుడు అప్పాయమ్మ అయి దాని వొళ్ళంతా లతలు తిరిగి, పువ్వులు పూయి. నిప్పా నూనే లేక ఎఱ్ఱగా పీచుకట్టిన తల తుమ్మెదలాగ నల్లబడి నిగనిగలాడుతూ, నొక్కులు తేలి వెనక్కి వాలు జడగా వేళ్ళాడుతున్నది.

వీధిలో అప్పాయమ్మకి ం తో చలేదు. వీధి, కూలీలవీధి. ఆడా మొగా పనుల్లోకి పోతారు. ఒక్కతే ముసలాళ్లతో, దిగవిడిచిన పిల్లలతో ఊసులాడుతూ కాలం గడపడము దుర్భరమై అది రోడ్డెక్కింది.

రోడ్డుమీది కొచ్చిన పశువులంటే దానికెంతో మక్కువ బళ్లు వస్తే దానికి వొళ్లు తెలియదు. బళ్లన్నా ప్రేమే. బళ్లంటే బళ్లకి కట్టిన ఎడ్లూ పోతులూ దానికి చాలా అభిమానమైనవి.



http://www.maganti.org/

తొమ్మిది గంటలకల్లా కూలీల వీధి ఖాళీ అయిపోయింది.
అప్పాయమ్మ గోడెక్కి నిలబడ్డాది బళ్ళబాట చూస్తు
న్నాది. పరమానందంతో బళ్ళ రాకకి ఎదురు చూస్తున్నాది.
బళ్ళలోని వాళ్ళని చూడగానే అప్పాయమ్మకి ఎడ్లూ,
గిత్తలమీదనున్న అభిమానం ఎక్కువ అయింది. బళ్ళు
భోగాపురంవి. వాటికున్న రిబ్బను లింగాల వలన భోగా
పురానికి ఆరు మైలు దూరంలో ఉన్నారు. మొదటి బండి

ముత్తాలమీది నాయుణ్ణి "ఓరన్నా ఏ యూరు బళ్లు?" అని ప్రశ్నించింది.

"భోగాపురం" అన్నాడు నాయుడు.

"పోలిపల్లే అడిగినానులే. లింగాలవలస సూరినాయుడు బాగున్నాడా?" అని తిరిగి ప్రశ్నించింది.

"ఆడికేం ఆబోతులా గున్నాడు. ఎనక బండిమీదున్నాడు" అని చెప్పేడు.

బళ్లబారు చాలా పొడుగ్గా ఉంది. మూడు వూళ్ళ వేరుశనక్కాయ పట్నపు సాహుకారు ఒక్కసారి ఖరీదు చేశాడు. భోగాపురం చుట్టుపట్ల వూళ్ల వాళ్లంతా బళ్ళు కట్టేరు. అప్పాయమ్మ సూరినాయుడు కోసం ఎదురుచూస్తూ బండి బండీ పరీక్షతో చూస్తున్నాది. రోడ్డెక్కిన కారణం మరిచిపోయి సూరినాయుడి కోసం పరితపిస్తున్నాది.

సూరి నాయుడు కనబడ్డాడు. ముత్తాలమీద కూచున్నాడు. అప్పిని సూరినాయుడు ఒకలాగ ఎరుగునా? ఒక్క వూరివాళ్ళు. ఉడుపుల్లో, గొప్పుల్లో చిన్నప్పణ్ణుంచి ఎక్కడపడితే అక్కడ నాయుడు ఎరక్కపోతే ఇంకెవరు ఎరుగుదురు?

"ఏంరా సూరిగా?" అని పలకరించింది. సూరిగాడు అప్పాయమ్మని పోల్చుకోలేదు. కంఠధ్వని వినగానే తుళ్ళిపడి చూశాడు. ముత్తాల్లోంచి ఒక్క గెంతు గెంతి బండి నాపేశాడు. బళ్లబారు బారంతా ఆగిపోయింది

"ఓలె నువ్వేనా అప్పి? పట్నపు పసందు బాగా వొచ్చిందే! బాపనమ్మవత్తో అనుకున్నాను!" అని ఆశ్చర్యపోయాడు అప్పి నవ్వింది. దాని కళ్ళు కూరుకుపోయాయి. దాని వొళ్లంతా పులకరించింది. సూరిగాడు అప్పిని చూసి బాపనమ్మ అనుకొన్నాడు! వాడు అప్పిని చూసి రెండేళ్లయింది. రెండేళ్లనుంచి అప్పి కన్నారిటికి వెళ్లడం మానేసింది.

"ఈ యేడాదేనా అమ్మోరి పండక్కి వొస్తావా?" అనడిగేడు.

"వొస్తాను" అన్నాది. అప్పి అప్పాయమ్మ అయిన తరవాత కన్నారి గ్రామం ఒక్కసారి వెళ్ళక తప్పదని అనుకొన్నాది.

"సూరిగాణ్ణి మరిచిపోకేం" అన్నాడు సూరిగాడు.

"మరిచిపోతే పలకరిద్దునా?" అన్నాది. వెనక బళ్లన్నీ ఆగిపోయాయి.

'ఓరే తోలరా బండి" అని గద్దించారు.

నాయుడికి బండి తోలుకు వెళ్లిపోవడం కష్టంగానే ఉంది. అప్పిని చూస్తు నిర్ఘాంతపోయాడు. అప్పి అప్పా

యమ్మ అయిపోయిందని వాడికేం తెలుసు? దాని వొళ్లంతా లతలు, పువ్వులు, రంగులూ ఉంటాయని వాడికేం తెలుసు? జడ వేళ్లాడ వేసి పువ్వులు పెట్టుకుంటుందని వాడికేం తెలుసు? చెవుల్లోంచి బంగారపు జుంకాలు వేళ్లాడుతూ ఉంటాయని వాడికేం తెలుసు?

వాడికి తెలియాలనే అప్పాయమ్మ బళ్ళు నాపింది. బోరిగెబుంగ పట్టుకున్న పల్లెటూరిఅప్పికీ, రంగులు లత లతో ధగధగ లాడుతున్న పట్నపు అప్పాయమ్మకీ భేదం చూపించాలనే బళ్ళు నాపింది.

బళ్ళు వెళ్లిపోయాయి.

అప్పి మొగుడు కామరాజు. ఇటికల ఆవం పెట్టు కున్నాడు. ఇటిక్కి ధరొచ్చింది. చిల్లి కాణీలు లేని కూలీల వీధిలో కామరాజు కాయితాలవాడు అయేడు. ఇప్పుడు వాడి చేతు నిండా రంగు రంగుల నోట్లు. అప్పికి అట్లు తోముకునే ఖర్మం పోయింది. చెవులకి బంగారపు జుంకా లొచ్చాయి.

వీధిలో ఏమీ తోచక అప్పాయమ్మ రోడ్డెక్కింది. రోడ్డుమీద పడి పోతూ దానికి డబ్బు కనబడ్డాది. ఊరికే కూచోడమేమి? అధికంగా డబ్బు వాసనే చేదా? వాళ్ళ వీధి అనేక గ్రామాలకి రహదారి. బళ్ళన్నీ అలాగే వెళ్తాయి. రోడ్డు నిండా పేడకళ్లు పొద్దసమానం పడతాయి. పేడలో డబ్బుంది! పిడకలు పెట్టుకొంటే పిడికెడు చిల్లర చేతికొస్తుంది.

అప్పాయమ్మ తెగకోకలు కొంటున్నాది. ఇప్పుడు కోకల నిండా అన్నీ రంగులే, లతలే, పువ్వులే. దాని చేతుల నిండా పేడే. ఇంటి చుట్టూ పేడ కుప్పలే. ఇంటి గోడలనిండా పచ్చి పిడకలే. దాని ఇల్లంతా పేడకంపు. వొళ్ళెల్లా పేడకంపే.

అప్పాయమ్మ అందమైనది. వయసులో ఉంది. నిగనిగ లాడుతున్న నీలి కలవపువ్వు. పేడలో పెంట పెరుగ. పెంట పురుగు అందమైనది !